

# షారుఖ్ కన్నా నాకే ఎక్కువ

**బాలీవుడ్‌లో** స్టార్ హీరో షారుఖ్ ఖాన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బుల్లితెరపై యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన షారుఖ్ 'దీవానా' సినిమాతో హీరోగా మారాడు. వరుస హిట్లతో బాలీవుడ్ బాద్‌షాగా ఎదిగాడు. పఠాన్, జవాన్ సినిమాలతో గతేడాది భారీ విజయాలను అందుకున్నాడు. 'దీవానా' సినిమాకు కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన ఫరాఖాన్ షారుఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. 'దీవానా కన్నా ముందు షారుఖ్ 'కబీ హా కబీ నా' సినిమాకు సంతకం చేశాడు. ఈ సినిమా అనుకున్న దానికంటే తక్కువ బడ్జెట్‌లోనే పూర్తయింది. ఆ చిత్రానికీ నేనే కొరియోగ్రాఫర్‌ని. ఇందులో నటించినందుకు షారూఖ్‌కు రూ.25 వేలు ఇచ్చారు. అందరికంటే ఎక్కువ రెమ్యునరేషన్ నాకే ఇచ్చారు. ఒక్క పాటకు రూ.5,000 చొప్పున ఆరు పాటలకుగానూ రూ.30,000 పారితోషికం అందుకున్నా. అప్పట్లో అసిస్టెంట్‌ను పెట్టుకునేంత సీన్ కూడా లేదు. కాబట్టి ఆ జీతం అంతా నేను మాత్రమే తీసుకున్నాను' అలా.. షారుఖ్ కన్నా తానే ఎక్కువ రెమ్యునరేషన్ అందుకున్నానంటూ చెప్పుకొచ్చింది ఫరా. ఈ సినిమా నుంచే షారూఖ్– ఫరా ఖాన్ మధ్య స్నేహ బంధం బలపడింది. తర్వాతికాలంలో ఫరా ఖాన్ దర్శకత్వంలో షారుఖ్ 'మై హూనా', 'ఓం శాంతి ఓం', 'హ్యాపీ న్యూ ఇయర్' చిత్రాల్లో నటించాడు.

## క్షణక్షణం

ఓటీటీ హిట్

### పిహు

**నటీనటులు:** మైరా విశ్వకర్మ, ప్రేరణ శర్మ
**దర్శకుడు:** వినోద్ కాప్రి
**ఓటీటీ:** నెట్‌ఫ్లిక్స్

పిల్లల సినిమా అనగానే వాళ్లు చేసే అల్లరి, సరదా సరదా కబుర్లు ఆశిస్తాం. అయితే, ఈ సినిమా మాత్రం మన ఊహకు అందని విధంగా ఉంటుంది. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో చిక్కుకున్న ఓ చిన్నారి కథే 'పిహు'. 2018లో హిందీలో వచ్చిన ఈ సినిమా ఇప్పటికీ నెట్‌ఫ్లిక్స్ టాప్ రేటెడ్ మూవీస్ లిస్ట్‌లో ఉంది. ఈ సినిమా చూసిన తర్వాత చిన్న పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి బయటికి వెళ్లాలంటే ఒకటికి వందసార్లు ఆలోచిస్తారు.



పిహు (మైరా విశ్వకర్మ) బర్త్‌డే తర్వాతి రోజు జరిగిన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. పిహు పుట్టినరోజు వేడుకకు తండ్రి గౌరవ్ (రాహుల్ బగ్గా) ఆలస్యంగా వస్తాడు. తన భర్త గౌరవ్‌కు మీరా అనే మహిళతో అక్రమ సంబంధం ఉందని పిహు తల్లి పూజ (ప్రేరణ శర్మ) అప్పటికే అనుమానం పెంచుకుంటుంది. కూతురు పుట్టిన రోజున కూడా భర్త ఆలస్యంగా రావడాన్ని జీర్ణించుకోలేని పూజ.. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ విషయాన్ని గుర్తించక గౌరవ్ ఆఫీస్ పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్తాడు. పిహు నిద్రలేచి చూసేసరికి తల్లి మరణిస్తుంది. ఈ విషయం తెలియని చిన్నారి పలుసార్లు తల్లిని లేపేందుకు ప్రయత్నిస్తుంది. ఎంతకీ సాధ్యం కాకపోవడంతో మామూలుగానే ఆడుకోవడం మొదలుపెడుతుంది. తల్లి మరణించిందని తెలియక చిన్నారి పిహు... ఇంట్లో ఏం చేస్తుంది. ఆడుకునే క్రమంలో ఫ్రిజ్, గ్యాస్, వాటర్ ఫిల్టర్, ఐరన్ బాక్స్‌ను ఆన్‌చేసి అలాగే వదిలేస్తుంది. ఈ పరిస్థితుల్లో ఆ చిన్నారికి ఏమవుతుందోనన్న ఉత్కంఠ మొదలవుతుంది. కేవలం రూ.45 లక్షల బడ్జెట్‌తో దీన్ని తెరకెక్కించారు. పిహుగా.. బాలనటి మైరా మెప్పిస్తుంది. ఎందుకు ఆలస్యం.. వీకెండ్‌లో సస్పెన్స్ కోరుకునేవాళ్లకు ఈ సినిమా మంచి ఎంపిక.


నమస్తే తెలంగాణ

# జిందగీ

13


హైదరాబాద్ | ఆదివారం 16 జూన్ 2024 www.ntnews.com


# ఎంతిచ్చినా చేసేవాణ్ని కాదు!

**'అర్జున్ రెడ్డి'** సినిమాతో మొదటి ప్రయత్నంలోనే దర్శకుడిగా హిట్ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచిన డైరెక్టర్ సందీప్ వంగా. ఇదే సినిమాను 'కబీర్ సింగ్'గా హిందీలోనూ రీమేక్ చేసి అక్కడా హిట్ కొట్టి నిలబడ్డాడు. అంతేకాదు తన మూడో సినిమా 'యానిమల్'తో రూ.900 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సత్తా చాటుకున్నాడు సందీప్. కాగా, యానిమల్ సినిమా కలెక్షన్ల పరంగా సూపర్ హిట్ అనిపించుకున్నా చాలామంది ఈ చిత్రంపై పెదవి విరిచారు. 'కబీర్ సింగ్'లో నటించిన ఆదిల్ హుస్సేన్ యానిమల్‌పై సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. నిజానికి ఆదిల్ 'కబీర్ సింగ్'తో బాగా పాపులర్ అయ్యారు. కానీ, రిలీజ్ తర్వాత ఆ సినిమాలో నటించినందుకు గిల్టీగా ఫీలవుతున్నానని, సినిమా చూసి సిగ్గుతో తలదించుకున్నానని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. అయితే ఆదిల్ కామెంట్స్‌పై సందీప్ కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చాడు. ఆదిల్‌కు 30 సినిమాలు చేసినా రాని గుర్తింపు ఈ ఒక్క సినిమాతో వచ్చిందని గుర్తు చేశాడు. సందీప్‌పై కామెంట్స్ మళ్లీ స్పందించాడు ఆదిల్. 'ఆయనేమైనా తైవాన్ డైరెక్టర్ ఆంగ్ లీ కన్నా ఫేమస్ అనుకుంటున్నాడా? అతను అంతలా ఊహించుకుంటే నేనేం చేయలేను. 'కబీర్ సింగ్' కలెక్షన్ల ముచ్చట నాకు అంతగా తెలియదు. కానీ, ఆంగ్ లీ తెరకెక్కించిన 'లైఫ్ ఆఫ్ పై' చిత్రం రూ.5,000 కోట్లకు పైగా వసూళ్లు చేసింది. ఈ లెక్కల్ని ఆయన సాధిస్తాడని నేను అనుకోవడం లేదు. సందీప్ ఆచితూచి మాట్లాడితే బాగుండేది. ఏదో ఆవేశంలో వాగేశాడు. దాన్ని నేను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించాడు. 'యానిమల్ సినిమాలో ఏదైనా పాత్ర ఆఫర్ చేస్తే చేసేవారా?' అని ప్రశ్నిస్తే.. రూ.200 కోట్లు ఇచ్చినా చేసేవాడిని కాదని, అలాంటివి ఎప్పటికీ చేయనని చెప్పుకొచ్చాడు. 2012లో వచ్చిన లైఫ్ ఆఫ్ పై సినిమాలో ఆదిల్ ఓ పాత్రలో నటించాడు.



# బరువు పెరగాలి బాబూ!



**బాలీవుడ్** హీరో రణ్‌వీర్ సింగ్ ఫిట్‌నెస్‌కు నిర్వచనంగా కనిపిస్తాడు. కండలు తిరిగిన దేహం ఆయన సొంతం. ఎడతెరపి లేకుండా ఎక్సర్‌సైజులు చేసి మరీ ఈ రూపాన్ని సంపాదించుకున్నాడు. ఏండ్లుగా కష్టపడి పోషించిన శరీరాన్ని కాపాడుకోవడం కత్తి మీద సామే! జిహ్వ చాపల్యాన్ని చంపుకొంటేనే గానీ, పెరిగిన కండలు కరగకుండా ఉంటాయి. ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడు రణ్‌వీర్. చాకు లాంటి ఈ హీరో తాజాగా ప్లేటు నిండా ఫ్రైస్‌తో కనిపించాడు. ఓ ఫుడ్ కోర్టుకు వెళ్లి మరీ ఫ్రెంచ్ ఫ్రైస్ ఆర్డర్ ఇచ్చాడు. అవన్నీ తనకే అన్నట్టుగా ఫొటో దిగి ఇన్‌స్టాలో పోస్టు చేశాడు. అహరహం ఆహార నియమాలు, ఆరోగ్య సూత్రాలు పాటించే రణ్‌వీర్ ఇలా ఫ్రైస్ తినడానికి సిద్ధమవ్వడమేంటని ఆశ్చర్యపోకండి. సినిమా కోసం శరీరాన్ని కష్టపెట్టుకునే ఈ హీరో.. తన అప్‌కమింగ్ ప్రాజెక్టు కోసం డైట్ ప్లాన్‌ను పక్కన పెట్టేశాడట. రాబోయే సినిమాలో పాత్ర కాస్త నిండుగా కనిపించాలని ఏకంగా పదిహేను కిలోలు పెరగడమే లక్ష్యంగా పెట్టుకున్నాడట రణ్‌వీర్. అందుకోసమే ఇదిగో ఇలా.. కొన్నాళ్లు రుచులు ఆస్వాదించడానికి సిద్ధపడ్డాడు. ఇన్‌స్టాలో ఈ హీరో పోస్ట్ చూసి ఆయన అభిమానులు ఇదంతా 'డాన్ 3' సినిమా కోసమే అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# నాకు ఆవిడే స్ఫూర్తి

**'లాపతా లేడీస్'** సినిమాలో ఫూల్ కుమారీగా అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకున్న నటి నితాంశీ గోయల్. చిన్నప్పటి నుంచే బుల్లితెర, వెండితెరపై రాణిస్తున్నది. సోషల్ మీడియాలోనూ ఆమెకు ఫాలోవర్స్ ఎక్కువే. నోయిడాలో పుట్టి పెరిగిన నితాంశీకి కరాటేలో ప్రవేశం ఉంది. 'మోహినీ అట్టమ్'లోనూ శిక్షణ పొందింది. శాస్త్రీయ నృత్య పోటీల్లో పాల్గొని బహుమతులూ అందుకుంది. పియానో కూడా వాయిస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన నితాంశీ.. ప్రముఖ బ్రాండ్స్‌కి మోడలింగ్ చేసింది. టీవీ ప్రకటనల్లోనూ నటించింది. తన పేరుతోనే ఓ యూట్యూబ్ చానెల్ నిర్వహిస్తున్నది. 2022లో యునైటెడ్ బిజినెస్ జర్నల్ 'ఇన్‌ఫ్లుయెన్షియల్ పర్సనాలిటీస్–30 అండర్ 30' జాబితాలోనూ చోటు దక్కించుకుంది. చైల్ ఆర్టిస్ట్‌గా 'వికీ డోనర్'తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నితాంశీ 'ఎమ్.ఎస్.ధోనీ: ది అన్‌టోల్ స్టోరీ', 'ఇందూ సర్కార్' సినిమాలతో మంచి గుర్తింపు దక్కించుకుంది. తాజాగా 'లాపతా లేడీస్' సినిమాతో మరోసారి టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారింది. 'లవ్ స్లీప్ రిపీట్', 'ఇన్‌సైడ్ ఎడ్జ్' వెబ్‌సిరీస్‌లలోనూ సత్తా చాటింది. అంతేకాదు 'మేరే సప్నే', 'నఖ్రా', 'హమ్ మిలే థే జాహా' వంటి మ్యూజిక్ ఆల్బమ్స్‌లో కూడా మెరిసింది. వయసుకు మించిన పరిణితితో రాణిస్తున్న నితాంశీ తనకు ప్రియాంక చోప్రా అంటే చాలా ఇష్టమని చెబుతున్నది. ఆమె సినిమాలు చూస్తూ ఆమె యాక్టింగ్ స్కిల్స్ అబ్జర్వ్ చేస్తూ పెరిగాననీ, ప్రియాంక తనకు ఇన్‌స్పిరేషన్ అని వెల్లడించింది.




## కథ బాగుంటే సినిమా మినిమమ్ గ్యారెంటీ!

### ఆ సినిమాలో పాటలు బాగుంటే.. బొమ్మకు తిరుగుండదు.

**మరి కథే.. సంగీతమైతే, అది చిత్రరాజం అవుతుంది. దశాబ్దాలు గడిచినా ఆ సినిమా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచి ఉంటుంది. సంగీత ప్రధానంగా తెరకెక్కిన సినిమాలు వెండితెర కావ్యాలుగా చిరకీర్తిని మూటగట్టుకున్నాయి. రసహృదయులను అలరించాయి. పండితుల ప్రశంసలు పొందాయి. అలాంటి చిత్రమాలికలోని పుష్ప'రాగాల'ను ఒకసారి తలుచుకుందాం..**





# శాస్త్రీయ సినీరాగాలు

'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః..' అని ఆర్యోక్తి. శిశువులు, పశువులు, పక్షులు, చివరికి విష సర్పాలు సైతం సంగీతానికి వశం కావలసిందే! వ్యాధుల్ని సైతం నయం చేసే ఔషధి సంగీతం. అదో జీవధార.. ఇంకా మాట్లాడితే మహా సముద్రం. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, పండిట్ జస్‌రాజ్, పండిట్ భీమ్‌సేన్ జోషి ఇలా ఎందరో సంగీత దిగ్గజాలు భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని తమ గానామృతంతో ద్విగుణీకృతం చేశారు. ఆ కళామూర్తుల ప్రతిభ పండితులకే పరిమితమైందన్న వాదనను కూడా కొట్టిపారేయలేం. ఈనాడు శాస్త్రీయ సంగీతం పామరులకు సైతం చేరువైందంటే అందులో సినిమా పాత్ర చాలానే ఉంది. కచేరీలకే పరిమితమైన గమకాల విన్యాసాలను కోట్లాది మంది శ్రోతలకు చేరువ చేసింది సినిమా. ఇందులో సంగీత ప్రధాన చిత్రాల పాత్ర కీలకం.

> ఏది ఏమైనా.. సినిమాకు అద్భుతమైన సంగీతం ఉంటే సరిపోదు. చక్కటి కథ కుదరాలి. అందులో సంగీతం సరిగ్గా ఇమడాలి. చూసిన ప్రేక్షకులకు పాత్రలు గుర్తుండిపోవాలి. సన్నివేశాలు వెంటాడాలి. పైన ప్రస్తావించిన సినిమాలన్నీ ఆ తరహా సినిమాలే.. అలాంటి కథలు, అలాంటి పాటలు, అలాంటి పాత్రలతో.. మన తెలుగు వెండితెర మరోసారి మోహన రాగంలో ప్రేక్షకులను సమ్మోహన పరచాలని ఆశిద్దాం.


### నాగయ్య.. త్యాగయ్య

'త్యాగయ్య'.. నాగయ్య స్వీయదర్శకత్వంలో నటించి, నిర్మించిన సినిమా. ఈ చిత్రానికి సంగీతం కూడా ఆయనే అందించారు. స్వరాలు అందించడమే కాదు.. ఆగమనుతుడికి అంకితమైన త్యాగయ్య కీర్తనల్నీ సుస్వరంగా గానం చేశారు. త్యాగయ్య పాత్రలోకి నాగయ్య పరకాయ ప్రవేశమే చేశారు. 1946లో విడుదలైన ఈ సినిమా అఖండ విజయాన్ని సాధించింది. ఇందులోని 'సామజవరగమనా..', 'నగుమోము.. గనలేని..', 'ఎందరో మహానుభావులు..', 'నిధి చాలా సుఖమా..' కీర్తనలు నాగయ్య గొంతుకలో కొత్త జీవం పోసుకున్నాయి. ముఖ్యంగా భవబంధాలనూ పరిత్యజించి, రామసాయుజ్యం కోసం ఎదురుచూసే తాగరాజస్వామిగా పతాక సన్నివేశంలో నాగయ్య అభినయం అనితర సాధ్యం. అందుకే.. తెలుగు సినీచరిత్రలో నాగయ్య 'త్యాగయ్య' ఓ అజరామర కావ్యం.

### సంగీత ఝరి.. 'జయభేరి'

1940వ దశకం చివరి నాటికి తెలుగు సినిమా సంగీతంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉద్దండులైన సంగీత మార్తాండులు చిత్రరంగ ప్రవేశం చేశారు. సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల, పెండ్యాల, టీవీ రాజు, కేవీ మహదేవన్, మాస్టర్ వేణు.. వీరంతా ఈ ఎరాలో వచ్చినవారే. వీరంతా అప్పటికి అందుబాటులో ఉన్న సాంకేతికతతో ప్రయోగాలకు పూనుకున్నారు. తెలుగు సినిమాకు స్వర్ణయుగం మొదలైంది. వెండితెర సంగీతం కొత్త పల్లవి అందుకుంది. ఈ సమయంలో వచ్చిన పూర్తి సంగీత భరిత చిత్రం అక్కినేని నాగేశ్వరరావు 'జయభేరి'. 1959లో విడుదలైన ఈ సినిమా ఫస్ట్ రిలీజ్‌లో అంతగా ఆడకపోయినా.. సెకండ్ రిలీజ్‌లో శతదినోత్సవాలు జరుపుకొన్నది. ఈ చిత్రంలోని పాటలు నిజంగా ఆ పాత మధురాలే. సంగీత దర్శకుడిగా పెండ్యాల నాగేశ్వరరావు విశ్వరూపం ఈ సినిమా. అలాగే గాయకుడిగా ఘంటసాల విరాట్ స్వరూపం ఈ సినిమా. 'రసికరాజ తగువారము గామా..', 'అధికులనీ.. అధములనీ..', 'రాగమయీ రావే..', 'యమునా తీరమున..' పాటలు గ్రామ్‌ఫోన్ రికార్డులు బద్దలు కొట్టాయి. పార్కు రేడియోల్లో మార్మోగాయి. గ్రామ కూడళ్లలో విపరీతంగా వినిపించాయి. ఈ సినిమా విడుదలయ్యాక ఎక్కడ పాటల పోటీలు జరిగినా.. పోటీదారులంతా 'జయభేరి' గీతాలే అందుకునేవారంటే.. ఆ చిత్ర ప్రభావం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా పీబీ శ్రీనివాస్‌తో కలిసి ఘంటసాల ఆలపించిన 'మది శారదాదేవి మందిరమే..' పాటకు సంగీతజ్ఞులు సైతం ఓలలాడారు. ఇక అక్కినేని అభినవ కౌశలం గురించి ఎంత చెపుకొన్నా తక్కువే. పతాక సన్నివేశంలో ఆయన నటన శిఖరస్థాయిలో ఉంటుంది.

### వినుడు వినుడు.. లవకుశ



కథా వస్తువు సంగీతం కాకపోయినా... 'లవకుశ' చిత్రం సంగీత భరితమై ప్రేక్షకులను అలరించింది. వాల్మీకి రామాయణ గాథను సీనియర్ సముద్రాల మూడు పాటల్లో వర్ణించిన తీరు అమోఘం. వాటికి ఘంటసాల కట్టిన బాణీలు రామకథంత రసరమ్యంగా కుదిరాయి. అందుకే 'లవకుశ' గీతాలు కాలాతీతంగా అలరిస్తూనే ఉన్నాయి. 'రామకథను వినరయ్యా...', 'వినుడు వినుడు రామాయణగాథ..', 'శ్రీరాముని చరితమును తెలిపెదమమ్మ..'.. ఈ మూడు పాటలు వింటే రామయణం మొత్తం విన్నట్టే. అంతేకాదు.. సినిమాలో సన్నివేశాలకు అనుగుణంగా వచ్చిన పాటలన్నీ హిట్టే! 'ఏ నిమిషానికి ఏమి జరుగునో..', 'సందేహింపకు మమ్మా..', 'ఊరికే కన్నీరు నింప కారణమే మమ్మా..' తదితర గీతాలు శ్రీరామనవమి సందర్భంగా ఊరూరా మార్మోగుతూనే ఉంటాయి.

### ఓంకార నాదం.. శంకరాభరణం

కళాతపస్వి కె.విశ్వనాథ్ 'శంకరాభరణం'(1980).. పాశ్చాత్య సంగీతపు పెనుతుఫాన్‌కు రెపరెపలాడుతున్న సత్ సంప్రదాయ సంగీత జ్యోతిని ఒక కాపు కాయడానికి ఓ దర్శక దిగ్గజం చేసిన మహాయజ్ఞం ఈ సినిమా. 'ఓంకార నాదాను సంధానమౌ గానమే..', 'దొరకునా ఇంటువంటి సేవ..', 'శంకరా నాదశరీరాపరా', 'బ్రోచేవారెవరురా..', 'సామజవరగమనా..' ఈ పాటలు విని తరించని తెలుగువాడు లేడు. తెలుగునాట శాస్త్రీయ సంగీత ప్రస్థానం 'శంకరాభరణం' ముందు–తర్వాత అన్నట్టుగా మారిపోయింది. వేటూరి సాహిత్యం, కేవీ మహదేవన్ సంగీతం, ఎస్పీ బాలు గాత్రం ఇవన్నీ విశ్వనాథ్ సినీ కచేరీకి పక్క వాద్యాలుగా పనిచేశాయి. ఇలాంటి సినిమా ఆలోచించడం.. ఇంత గొప్పగా తెరకెక్కించడం.. దైవలిఖితమే. నిజం చెప్పాలంటే మళ్లీ కె.విశ్వనాథ్ కూడా ఇంత గొప్ప సినిమా తీయలేకపోయారు. అది విశ్వనాథే అంగీకరించారు కూడా! ఓ విధంగా తనంతట తానుగా తయారైన సినిమా 'శంకరాభరణం'. పురాణ, ఇతిహాసాల గురించి భాషణం చేసే చాగంటి కోటేశ్వరరావు.. 'శంకరాభరణం' గురించి రెండు రోజులపాటు మూడేసి గంటలు ప్రవచనం చెప్పడం ఆ సినిమా స్థాయిని తెలియజేస్తుంది. అదికూడా ఆ సినిమా విడుదలైన మూడు పుష్కరాల తర్వాత. ఇంతకంటే ఆశ్చర్యం ఏముంటుంది చెప్పండి!?. విశేషం ఏంటంటే.. 'శంకరాభరణం' విడుదలయ్యాక, తెలుగునేలపై సంగీత పాఠశాలలు వందల్లో వెలిశాయి. వేలాదిమంది పిల్లలు సంగీతం నేర్చుకోవడానికి ఆసక్తి చూపించారు. అందుకే 'శంకరాభరణం' ఆల్‌టైమ్ క్లాసిక్. తెలుగు సినిమా స్థాయిని పెంచిన చిత్రం. 'శంకరాభరణం' తర్వాత విశ్వనాథ్ లలితకళల చుట్టూ తిరిగే కథాంశాలతో ఎక్కువ సినిమాలు చేశారు. వాటిలో సిరివెన్నెల, శృతిలయలు, స్వాతికిరణం, స్వరాభిషేకం సినిమాల నేపథ్యం శాస్త్రీయ సంగీతమే కావడం విశేషం. విశ్వనాథ్ తర్వాత ఈ తరహా సినిమాలు చేయడానికి ఏ దర్శకుడూ ధైర్యం చేయలేదు. ఎవరూ ముట్టుకోలేని జానర్ ఇది.

... బుర్రా నరసింహా